కథ

# మనకోసం ఆకాశం

ఎన్.శివనాగేశ్వర్రావ్

గేటు తెరుచుకున్న చప్పుడయింది.

అప్పుడే నిద్రపడుతున్న శంకరానికి నిద్రా భంగం అయింది.

తలతిప్పి గడియారం వంక చూశాడు. సమయం పదకొండు అయింది. "ఈ సమయంలో వచ్చింది ఎవరా? అని ఆలోచించలేద తను. వచ్చింది నాన్న కోసమే!" అని మాత్రం అనుకున్నాడు.

అంతలో పక్కగది తలుపు తెరుచుకుంది. "నువ్వా రమణయ్యా! ఈ సమయంలో వచ్చావు. మందేమైనా కావాలా?" అని తండ్రి అడగడం శంకరానికి వినిపిస్తూనే ఉంది.

"ఉన్నట్లుండి ఆయాసం వచ్చిపడింది. ఊపిరి సలపడం లేదు. అందుకే ఈ సమయంలో వచ్చాను. ఏమీ అనుకోకు క్రిష్ణమూర్తీ!" అన్నాడు రమణయ్య. "మరేం ఫర్వాలేదు. అలా కూర్చో! మందు ఇస్తాను" అన్నాడు క్రిష్ణమూర్తి.

అతనిచ్చిన మందు వేసుకుని అయిదు నిముషాల తరువాత వెళ్లిపోయాడు రమణయ్య. క్రిష్ణమూర్తి బయట గేటు వేసి వచ్చి మంచం మీద నడుము వాల్చాడు.

నిద్రాభంగం అయిన శంకరానికి మరిక నిద్ర పట్ట లేదు. అందుకు కారకుడైన తండ్రి మీద పీకలదాకా కోపం వచ్చింది. అది వెంటనే వెళ్లగక్కకపోతే మరిక నిద్రపట్టదని నిశ్చయం అయ్యాక మంచం మీద నుంచి లేచి తండ్రి గదిలోకి వెళ్లాడు.

"ఏం శంకరం! నిద్ర పట్టలేదా?" పలకరించాడు క్రిష్ణమూర్తి.

"పట్టిన నిద్ర నీ వలన పాడైంది. అయినా మందులు ఇవ్వడానికి వేళాపాళా లేదా? ఎప్పుడు పడితే అప్పుడు రావద్దని వాళ్లకు చెప్పు" అన్నాడు విసుగ్గా.

"వచ్చే రోగం వేళాపాళా చూసుకుని వస్తుందా? ఏదో చేతనైన సహాయం చేస్తున్నాను. కోపగించకు" అన్నాడు క్రిష్ణమూర్తి.

"నీ మటుకు నీవుండక ఎందుకొచ్చిన సహాయాలు? ఇంటిని సత్రం చేస్తున్నావు. ఎప్పుడూ ఎవడో ఒకడు వస్తూనే ఉంటాడు" చికాకు పడుతూ తన గదిలోకి వెళ్లిపోయాడు శంకరం.

కొడుకు మాటలకు క్రిష్ణమూర్తి మనసు చివుక్కుమంది. అది అతనికి కొత్త కాదు. అయినా ప్రతీసారీ బాధనిపిస్తూనే ఉంటుంది. 'ప్రక్కవాడికి సహాయం చేయడం తప్పా? మనిషికి మనిషి సహాయం చేయకపోతే మరెవరు చేస్తారు? ఎవరిమటుకు వాళ్లుంటే ప్రపంచం ఎలా నడుస్తుంది?' అనుకున్నాడు మనసులో.

మనిషి పదిమందితోనూ కలవాలి. తనకు తానుగా ఉంటే కుంచించుకుపోతాడు. పదిమందికి సహాయం చేస్తే పరిమళిస్తాడు అన్నది అతని భావన. అతను అలాగే ఉంటాడు. అందరూ అలా ఉండాలనుకుంటాడు.

శంకరానికి నిద్రపట్టలేదు. తండ్రితో అంత కటువుగా మాట్లాడకుండా ఉండవలసింది అనుకున్నాడు.

శంకరానికి పదేళ్ల వయసు వచ్చేసరికి అతని తల్లి కాలం చేసింది. ఎంతమంది ఎన్ని విధాలుగా చెప్పినా క్రిష్ణమూర్తి మరలా రెండో పెళ్లి చేసుకోలేదు. శంకరాన్ని ఎంతో ప్రేమగా పెంచి పెద్ద చేశాడు. ఆ అభిమానం శంకరానికి లేకపోలేదు. వద్దనుకుంటూనే తండ్రి మీద కోపగించుకుంటూ ఉంటాడు.

తలతిప్పి చూసిన శంకరానికి భార్య ఇందిర, అయిదేళ్ల కొడుకు అనిల్ నిద్రపోతూ కనిపించారు. గంటకుగాని శంకరానికి కంటిమీద కునుకు రాలేదు.

తెలతెలవారుతుండగా బయట గేటు తీసిన చప్పుడయింది. శంకరానికి వెంటనే మెలకువ వచ్చింది. 'ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. అప్పుడే తగలడ్డారు' అని మనసులో తిట్టుకున్నాడు.





క్రిష్ణమూర్తికి యోగాలో మంచి ప్రవేశముంది. రిటైరయ్యాక నలుగురిని పిలిచి ఆసనాలు వేయించడం, ధ్యానం చేయించడం వంటివి నేర్పించడం మొదలుపెట్టాడు. ఎప్పుడూ పదిమందికి తక్కువ కాకుండా జనం అతని దగ్గరకు వస్తూనే ఉంటారు.

అది శంకరానికి నచ్చదు. ఎవరింటి దగ్గర వాళ్లు యోగా చేసుకోవచ్చు కదా! మా ఇంటి మీదకు వచ్చిపడతారెందుకు? అనుకుంటాడు. అదే విషయం తండ్రితో వాదించాడు కూడా.

"ఎవరింటి దగ్గర వాళ్లుంటే బద్ధకిస్తారు. అందరూ ఒకచోట కలిస్తే శ్రద్ధ పెరుగుతుంది. మనిషి పదిమందితో కలిస్తే చాలా ప్రయోజనాలుంటాయి. నీవు కూడా వచ్చి వాళ్లతో పాటు యోగా చేయి. ఆరోగ్యానికి ఆరోగ్యం. మానవ సంబంధాలు మెరుగుపడతాయి" అని చెప్పేవాడు

# తెలివైన కాజల్

కుర్రభామ కాజల్ అగర్వాల్‌ని ఎక్స్‌పోజింగ్ గురించి అడిగితే- 'గ్లామరస్‌గా కనిపించడం వేరు, ఎక్స్‌పోజింగ్ చేయడం వేరు. అందంగా కనిపించేందుకు రకరకాల మాడర్న్ డ్రెస్సులు వేసుకోవడంలో కూడా తప్పులేదు. దానికే ఎక్స్‌పోజింగనీ అదనీ ఇదనీ పేర్లు పెట్టుకుంటే ఏం చేయలేం' అంటుంది. అయితే మరి ఎలాంటి ఎక్స్‌పోజింగ్‌కైనా సిద్ధమేనా మేడమ్? అన్నామనుకోండి- 'కథకి అవసరమనుకుంటే తప్ప అనవసరంగా మాత్రం చేయడం బాగోదు' అంటూ ముక్తాయింపునిచ్చింది.

క్రిష్ణమూర్తి. ఆ మాటలు శంకరానికి రుచించేవి కావు.

సమయం అయిదు గంటలు అయింది. శంకరం మరలా నిద్రపోవడానికి ప్రయత్నించాడు గానీ నిద్ర పట్టలేదు. అతనికి త్వరగా నిద్ర పట్టదు. పట్టినా చిన్న చప్పుడుకే మెలకువ వచ్చేస్తుంది.

అది తెలుసుకున్న క్రిష్ణమూర్తి ఒకసారి 'శంకరం! నీవు ఇష్టపడే ఒంటరితనం నీలో అభద్రతా భావం పెంచింది. నీ సంతోషం హరిస్తున్నది. అది నీవు గ్రహించడం లేదు. నీ మటుకు నీవుంటే నీ సంతోషం నీది. నీ దుఃఖం నీది. బయటకి వచ్చి పదిమందితో పంచుకుంటే నీ సంతోషం మరింత పెరుగుతుంది. దుఃఖం తగ్గుతుంది" అని సలహా ఇచ్చాడు. తండ్రి మాటలు ఛాదస్తంగా కొట్టిపారేశాడు శంకరం.

ఏడు గంటలకు యోగా క్లాస్ పూర్తయింది. వచ్చిన వారు వెళ్లిపోయారు. క్రిష్ణమూర్తి దాబా మీద నుంచి కిందకు దిగాడు. అప్పటికి శంకరం కాఫీ తాగి పేపర్ చదువుకుంటున్నాడు.

"కొంచెంసేపు ధ్యానం చేయకూడదూ? ఏకాగ్రత పెరుగుతుంది" అన్నాడు క్రిష్ణమూర్తి. శంకరం పేపర్‌లోంచి తలెత్తకుండానే "అవన్నీ పనీపాటా లేనివారికి. నాకెందుకు?" అన్నాడు.

క్రిష్ణమూర్తి మౌనంగా లోనికి నడిచి అప్పుడే నిద్రలేచిన మనవడ్ని పలకరించి వాడితో సూర్యనమస్కారాలు ప్రాక్టీస్ చేయించసాగాడు. అది చూసిన శంకరం "ఈయనగారు ఎవరినీ వదలడు" అనుకున్నాడు.

శంకరం స్నానం చేసి, టిఫిన్ తిని ఆఫీస్‌కి బయలుదేరబోతుండగా క్రిష్ణమూర్తి అతని దగ్గరకు వచ్చాడు.

"ఏమిటి?" అడిగాడు శంకరం. అతను, శంకరానికి అయిదు వందలు అందించి "ఈ చిరునామాకి మనీ ఆర్డర్ పంపించు" అని చెప్పాడు. "ఎందుకట?" వివరం అడిగాడు శంకరం.

"ఆ అబ్బాయికి చిన్న వయసులోనే గుండెజబ్బు. ఆపరేషన్‌కి ఆర్థిక సహాయం కోరుతూ పేపర్ ప్రకటన ఇచ్చారు. నేను చేయగల సహాయం చేస్తున్నాను" చెప్పాడు క్రిష్ణమూర్తి. "అవన్నీ దొంగ ప్రకటనలు" చెప్పాడు శంకరం.

"మనిషి మీద అంత అపనమ్మకం పెంచుకోకు శంకరం! మనిషి, మనిషిని నమ్మకపోతే అది మానవ మనుగడనే దెబ్బతీస్తుంది" కొడుకును హెచ్చరించాడు క్రిష్ణమూర్తి.

అంతలో అటు వచ్చిన ఇందిర, భర్తతో 'మామయ్య పెన్షన్ డబ్బులు ఆయన ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకోమని మీరే కదా చెప్పారు! ఇప్పుడు వాదన ఎందుకు? మామయ్యగారు చెప్పినట్లు చేయండి" అన్నది. క్రిష్ణమూర్తి కోడలి వంక ప్రేమ పూర్వకంగా చూశాడు.

శంకరం స్కూటర్ స్టార్ట్ చేస్తూ "అనిల్‌ని ఒకసారి బయటకు పిలువు" అని భార్యతో చెప్పాడు. "అనిల్! డాడీ పిలుస్తున్నారు!" కేక వేసింది ఇందిర.



వీడియో గేమ్ ఆడుకుంటున్న అనిల్ బయటకు రాకుండానే "బై డాడీ!" అని బిగ్గరగా అరిచాడు. కొడుకు బయటకు రాకపోవడం శంకరానికి అసంతృప్తిని కలిగించింది. ఆఫీస్‌కి బయలుదేరిపోయాడు.

మనవడు బయటకు రాకుండానే 'బై' చెప్పడం గమనించిన క్రిష్ణమూర్తి "మనిషి మనసుతో చేయవలసిన పనులు కొన్ని ఉన్నాయి. కానీ ఇప్పుడు అవన్నీ యాంత్రికం అయిపోతున్నాయి. కొంత కాలానికి మనిషి, మనసులేని మరబొమ్మ అయిపోతాడు" అనుకున్నాడు.

అతను మనవడి దగ్గరకు వెళ్లి 'అనిల్! నాన్న పిలిచినప్పుడు బయటకు వెళ్లి ప్రేమగా టాటా చెప్పాలి. అప్పుడతని మనసుకు సంతోషం కలుగుతుంది. వీడియో గేమ్ ఎప్పుడూ ఉంటుంది. డాడీ మళ్లీ సాయంత్రానికి గాని రాడు" అని చెప్పాడు.

"అలాగే తాతయ్యా! రేపటినుంచి బయటకు వెళ్లి డాడీకి బై చెప్తాను" అన్నాడు అనిల్. "కొడుకు కంటే మనవడే నయం. విషయం గ్రహించాడు" అనుకున్నాడు క్రిష్ణమూర్తి.

ఆయనకు భోజనం వడ్డించే సమయంలో "మామయ్యా! ఎల్లుండి అనిల్ పుట్టినరోజు. మీ యోగా వాళ్లను పిలుద్దాం" అన్నది ఇందిర. అతను కోడలు వంక అపురూపంగా చూశాడు. అతనికి శంకరం ఒక్కడే కొడుకు. కూతుళ్లు లేరు. అందుకని అతను కోడలులోనే కూతురిని చూసుకుంటాడు. ఆ అమ్మాయీ అంతే. మామగారిని పన్నెత్తి మాట అనదు. గౌరవంగా చూపిస్తుంది. ప్రేమ కురిపిస్తుంది.

"వాళ్లను పిలవడం శంకరానికి ఇష్టం ఉండదేమో!" అన్నాడు క్రిష్ణమూర్తి. "ఆయన ఎవరినీ పిలవొద్దనే అన్నారు. అయినా రోజూ మన ఇంటికి వచ్చేవాళ్లకు చెప్పకపోతే ఏం బాగుంటుంది? మీరు ఆహ్వానించండి. మీ అబ్బాయికి నేను నచ్చ చెప్తానులెండి" అన్నది ఇందిర. "అలాగేనమ్మా!" అన్నాడు క్రిష్ణమూర్తి.

ఆ సాయంత్రం శంకరం ఇంటికి వచ్చాక "మనీ ఆర్డర్ పంపావా?" అని అడిగాడు క్రిష్ణమూర్తి. "పంపాను. అది చూసి మా కొలీగ్ నవ్వాడు" చెప్పాడు శంకరం. "ఎందుకు నవ్వాడు?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"తనకి ఉన్నదేదో మనవడికి ఇవ్వాలి గానీ, ఎవరికో దానం చేయడం ఏమిటి?" అని కామెంట్ చేశాడు. చెప్పాడు శంకరం. "నువ్వేమన్నావు?" ఆరా తీశాడు క్రిష్ణమూర్తి. "అది నిజమేగా! అందుకే మౌనం వహించాను" చెప్పాడు

శంకరం.

"మనవాళ్లకే ఉపయోగపడాలనుకోవడం స్వార్థం అవుతుంది. అందరూ మనవాళ్లే అనుకోవడం ప్రేమ అనిపించుకుంటుంది. మనిషి ప్రేమించడం నేర్చుకోవాలనీ కొలీగ్‌కి చెప్పు" అన్నాడు క్రిష్ణమూర్తి. శంకరం తండ్రి వంక విసుగ్గా చూసి ఊరుకున్నాడు.

శంకరం కాఫీ తాగుతుండగా "అనిల్ బర్త్‌డేకి యోగా వాళ్లను పిలవమని మామయ్యకు చెప్పాను" అంది ఇందిర.

"నేననుకోవడం ఈ ఆలోచన నీది కాదు. మా నాన్నది" అన్నాడు శంకరం. ఇందిర కాదని చెప్పినా శంకరం వినిపించుకోలేదు.

కాఫీ తాగడం పూర్తయ్యాక తండ్రి దగ్గరకు వెళ్లాడు. ఆ సమయంలో క్రిష్ణమూర్తి మొక్కలకు నీళ్లు పోస్తున్నాడు.

"బాబు బర్త్‌డేకి యోగావాళ్లను పిలుస్తానన్నావట. వాళ్లు రావడం నాకిష్టం లేదు" చెప్పాడు శంకరం. "అయితే మీ ఆఫీస్ స్టాఫ్‌ని పిలువు. పుట్టిన రోజునాడు పదిమంది వచ్చి బాబు మీద అక్షింతలు వేసి దీవిస్తే మంచిది" చెప్పాడు క్రిష్ణమూర్తి.

"మావాళ్లు బిజీ. రాలేరు" చెప్పాడు శంకరం. "ఇంట్లో టీవీ చూస్తూ కూర్చోవడం, ప్రక్కింటివాళ్లతో కూడా సెల్‌ఫోన్‌లో మాట్లాడ్డం- ఇదేగా మీ దృష్టిలో బిజీగా ఉండడం" ప్రశ్నించాడు క్రిష్ణమూర్తి.


"అదేం కాదు. పిల్లల్ని కష్టపడి చదివించడం, టాలెంట్ పరీక్షలు రాయించడం వంటి పనుల్లో వాళ్లు బిజీ" చెప్పాడు శంకరం.

"పిల్లల మనసుల్ని చదువుల పేరుతో మీరు ఎదగనివ్వడం లేదు. మొగ్గలుగా ఉండగానే తుంచేస్తున్నారు. మానవ సంబంధాలు దెబ్బతినడానికి ఇదీ ఒక కారణం" అన్నాడు క్రిష్ణమూర్తి.

అంతలో అక్కడకు వచ్చిన ఇందిర, భర్తతో "రోజూ మన ఇంటికి వస్తున్నా ఏనాడూ మనం యోగా వాళ్లకు కాఫీ కూడా ఇవ్వలేదు. ఒకసారి పిలిచి పలకరిస్తే మర్యాదగా ఉంటుంది" అని సలహా ఇచ్చింది. శంకరం భార్య వంక గుర్రుగా చూశాడు.

ఆ రాత్రి క్రిష్ణమూర్తికి చాలాసేపు నిద్రపట్టలేదు. అతను తరిగిపోతున్న మానవ సంబంధాల గురించి ఆలోచించాడు. యంత్రాల మధ్య పడి మనిషి కూడా ఒక యంత్రంగా మారిపోతున్నాడు. మనిషికి మనసే తరగని ఆస్తి అన్న సత్యం మరచి పతనాన్ని కొనితెచ్చుకుంటున్నాడు" అని ఆలోచించాడు.

అనిల్ పుట్టిన రోజు వచ్చింది. ఆ రోజు సాయంత్రం క్రిష్ణమూర్తి పిలుపు అందుకున్న యోగా బృందం వాళ్లింటికి వచ్చింది. బాబుకి నీతి కథల పుస్తకాలు, ఆటబొమ్మలు తెచ్చిచ్చారు. తాము తెచ్చిన స్వీట్స్ బాబు చేత తినిపించారు. అక్షింతలు వేసి దీవించారు. పాటలు పాడి అనిల్‌ని ఆనందపరిచారు. వాడి చేత ఆడించారు, పాడించారు.



శంకరంతో కూడా కలుపుగోలుగా మాట్లాడారు.

ఎందుకో తెలీదుగానీ శంకరానికి ఆ సాయంత్రం ఆనందంగా గడిచిందనిపించింది. వాళ్లు వచ్చి ఉండకపోతే ఆ వేడుకకు అంత నిండుదనం వచ్చి ఉండేది కాదనుకున్నాడు.

వాళ్లందరూ వెళ్లాక క్రిష్ణమూర్తి, కొడుకుతో "మా వాళ్లు రావడం నీకేమైనా ఇబ్బందిగా అనిపించిందా?" అని అడిగాడు.

"అటువంటిదేం లేదు. సంతోషంగానే అనిపించింది" మనస్ఫూర్తిగా చెప్పాడు శంకరం.

"శంకరం! ఒక సత్యం చెబుతాను. నాది ఛాదస్తంగా భావించకుండా మనసు పెట్టి ఆలోచించు. మొక్కను తెచ్చి గదిలో పెడితే వాడిపోతుంది. బయట పెడితే చిగురిస్తుంది. దానికి జీవం పోసేది సూర్యకిరణం. ఇదే సూత్రం మనిషికీ వర్తిస్తుంది. ఒంటరిగా గదిలో కూర్చుంటే మనసు చచ్చిపోతుంది. బయటకు వెళ్లి పదిమందితో గడిపితే అది సేద తీరుతుంది. మనసుకు ప్రాణం పోసేది ప్రేమ అని మరువకు" అని చెప్పాడు క్రిష్ణమూర్తి. ఎప్పటిలా ఈసారి తండ్రి మాటలు శంకరం ఖండించలేదు. మౌనం వహించాడు.

ఆ రాత్రి క్రిష్ణమూర్తికి గుండెలో నొప్పిగా అనిపించింది. కొడుకును నిద్ర లేపి విషయం చెప్పాడు. ఎప్పుడూ ఏ నొప్పీ అనని తండ్రి ఒకేసారి గుండె నొప్పి అనగానే శంకరం కంగారుపడ్డాడు. "హాస్పిటల్‌కి వెళ్దాం" అన్నాడు. "ఉదయం వెళ్దాం" అంటూ క్రిష్ణమూర్తి హోమియో మందులేసుకుని కళ్లు మూసుకుపడుకున్నాడు. శంకరం తండ్రి మంచం పక్కనే పడక కుర్చీ వేసుకుని కూర్చున్నాడు.

అర్థరాత్రి చూస్తే తండ్రి ఊపిరి పీలుస్తున్నట్లు అనిపించలేదు. నాడి చూసిన శంకరం తండ్రి ప్రాణం పోయినట్లు గ్రహించి కంట తడి పెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న ఇందిర, అనిల్ పెద్దగా ఏడవసాగారు.

బంధువులకు, స్నేహితులకు కబుర్లు అందాయి. మరునాటికి అందరూ వచ్చారు. అంత దుఃఖంలోనూ ఒకే విషయం శంకరాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. అతను కబురు చేసినవారి కంటే వచ్చినవారు పది రెట్లున్నారు.

ఇంటి ముందున్న రోడ్డంతా జనంతో నిండిపోయింది. అందరూ విషాద వదనాలతో కనిపించారు.

## తెలుగుపై కన్నేసిన మినీషా

సెక్సీభామగా హిందీలో పేరు గడిస్తోన్న మినీషా లాంబా బికినీలు గట్రా ధరించి సెక్సీ గెటప్పులతో కనిపించడానికి ఏమాత్రం అభ్యంతర చెప్పడంలేదట. అయితే అన్నీ అలాంటి అవకాశాలు ఎన్నని వస్తాయి? అందుకనే మినీషా తన దృష్టిని ఇప్పుడు టాలీవుడ్ మీదికి మళ్లిస్తోంది. అప్పుడే తెలుగు చాన్సుల కోసం తెగ ప్రయత్నాలు చేసేస్తోందిట. ముంబాయి ముద్దుగుమ్మలంటే క్రేజున్న తెలుగు ఫీల్డులోకి మినీషా అడుగు పెట్టడం తేలికే కావచ్చు. మరి టాలీవుడ్‌లో మినీషా 'లక్' ఎలావుందో?

క్రిష్ణమూర్తి మంచితనం గురించి కథలు కథలుగా చెప్పుకోసాగారు.

"శంకరం! పూలదండలోని దారం బయకు కనిపించదు. కానీ అది పూలనన్నింటినీ దగ్గరకు చేరుస్తుంది. ప్రేమ కూడా అంతే! అది బయటకు కనిపించదు. కానీ మనుషులనందరినీ దగ్గరకు చేరుస్తుంది" అన్న తండ్రి మాటలు గుర్తుకొచ్చాయి శంకరానికి.

మధ్యాహ్నానికి శవయాత్ర మొదలయింది. పాడె మోయడానికి చాలామంది ముందుకొచ్చారు. భుజం మార్చుకుంటూ తమ అభిమానం చాటుకున్నారు. సాయంత్రానికి అంత్యక్రియలు కార్యక్రమం ముగిసింది.

ఆ తరువాత ప్రతీరోజు ఎవరో ఒకరు వచ్చి శంకరాన్ని కలిసి అతని తండ్రి మంచితనాన్ని పొగిడి, అతనికి ఓదార్పు మాటలు చెప్పేవారు. పెద్దకర్మ కూడా జరిగిపోయింది. ఇక అంతటితో అంతా ముగిసిపోయిందని ఇక ఎవరూ తమ ఇంటికి రారని ఊపిరిపీల్చుకున్నాడు శంకరం.

ఆ రాత్రి గాఢంగా నిద్రపోయాడు. తెలతెలవారుతుండగా మెలకువ వచ్చింది. తండ్రి చనిపోయేవరకూ ప్రతీరోజూ ఆ సమయానికి బయట గేటు తెరుచుకునేది. డాబా మీద తండ్రి, వచ్చినవారితో కలసి ఆసనాలు వేసేవాడు. వాళ్ల మాటలు, చిన్న చిన్న శబ్దాలు లీలగా వినిపించేవి. అప్పట్లో వాళ్ల వలన నిద్రపాడైందని తిట్టుకునేవాడు శంకరం. ఇప్పుడా నిశ్శబ్దం అతని మనసుకు బాధను కలిగించింది.

భోజనం చేసి ఆఫీసుకి బయలుదేరినప్పుడు పిలవకుండానే అనిల్ బయటకు వచ్చి టాటా చెప్పాడు. 'పిలిచినా రానివాడివి. ఈరోజు పిలవకుండానే వచ్చి టాటా చెబుతున్నావు. ఏమిటి విశేషం?" అడిగాడు శంకరం.

"తాతయ్య చెప్పాడు, నేను బయటకు వచ్చి నీకు 'బై' చెబితే నీ మనసుకు సంతోషం కలుగుతుందట" చెప్పాడు అనిల్. శంకరం కళ్లముందు తండ్రి రూపం కదలాడింది. మనసును ఎవరో మెల్లగా స్పృశించినట్లనిపించింది. కన్నుల్లో చెమ్మ చేరింది. కొడుక్కి 'బై' చెప్పి బయలుదేరిపోయాడు.

ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు కూరగాయల దుకాణానికి వెళ్లాడు. అతను ఆప్యాయంగా పలకరించి "నాన్నగారు పోయారని తెలిసింది. ఊళ్లో లేక రాలేకపోయాను. మహానుభావుడు. ఈ దుకాణం పెట్టుకోవడానికి బ్యాంకు లోను ఇప్పించి సాయం చేశాడు. అతన్ని ఎప్పటికీ మరచిపోలేను" అని చెప్పాడు.

"నాన్న కనిపించకుండా ఎంత చేశాడు?" అనుకున్నాడు శంకరం.

నెల రోజుల తరువాత శంకరానికి ఒక విషయం అర్థమయింది. తను భావించినట్లు చనిపోవడంతో తండ్రి అధ్యాయం ముగిసిపోలేదు. ప్రతిరోజూ ఎవరో ఒకరు క్రిష్ణమూర్తి సహాయాన్ని, మంచితనాన్ని, ప్రేమను శంకరం దగ్గర గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.

ఒకరోజు శంకరం టవల్స్ కొనడానికి బట్టల కొట్టుకు వెళ్లాడు. అది పేరుమోసిన బట్టల దుకాణం. ఆ దుకాణం యజమాని శంకరాన్ని చూడగానే పలకరింపుగా నవ్వి "మీరు క్రిష్ణమూర్తిగారి అబ్బాయి కదూ!" అని కూర్చోబెట్టి మర్యాద చేశాడు.

"అప్పుడప్పుడూ మీ నాన్నగారు వచ్చి ఇక్కడ కూర్చునేవారు. ఒకసారి నిద్ర పట్టక ఇబ్బంది పడుతున్నారని చెప్పాను. మానసిక అశాంతి వలన అయి ఉంటుంది. ధ్యానం చేయమని సలహా ఇచ్చారు. ధ్యానం ఎలా చేయాలో కూడా వివరించారు. అప్పటినుంచి ధ్యానం చేస్తున్నాను. మనసు చాలా ప్రశాంతంగా ఉంటున్నది. ఆయన చనిపోవడం దురదృష్టకరం" అని బాధపడ్డాడు దుకాణదారు.

తండ్రి ఎందరి మనసుల్లోనో నిలిచిపోయాడన్న సత్యం గ్రహించేసరికి శంకరానికి దిగులుగా అనిపించింది. అటువంటి తండ్రిని తను ఖాతరు చేసేవాడు కాదు. ప్రేమ చూపించేవాడు కాదు. ప్రతి చిన్న విషయానికీ తప్పు పట్టేవాడు. శంకరం మనసులో తీవ్రంగా బాధపడ్డాడు.

అతను ఇల్లు చేరగానే ఇందిర ఒక ఉత్తరం అందించింది. చనిపోయిన తండ్రి పేరున ఉన్నదా ఉత్తరం. శంకరం కవరు చింపి చదివాడు.

"శ్రీయుతులు క్రిష్ణమూర్తిగారికి నమస్సులు. మీవంటి మంచి మనసున్నవారు పంపిన విరాళాలతో నాకు గుండె ఆపరేషన్ జరిగింది. ఇప్పుడు నేను కులాసాగా ఉన్నాను. మీరు పంపిన విరాళం చిన్న మొత్తమే కావచ్చు. కానీ అది కష్టకాలంలో నాకెంతో ధైర్యాన్నిచ్చింది. నేను ఒంటరిని కాదు. నాకు తోడుగా చాలామంది ఉన్నారన్న ఆత్మసంతృప్తిని కలిగించింది. మీకు ధన్యవాదాలు... ఇట్లు, గోపీచంద్" అని ఉందా ఉత్తరంలో.

శంకరం గోడకు తగిలించిన తండ్రి ఫోటో వంక చూశాడు. "శంకరం! మనిషి- నేను, నా కుటుంబం అన్న సంకుచితత్వం నుంచి బయటపడి మనం, మన వసుధైక కుటుంబం అన్న విశాల దృక్పథం అలవరచుకోవాలి" అని చెబుతున్నట్లు అనిపించింది.

ఆ రాత్రి శంకరానికి నిద్ర కరువయింది. తనకు, తండ్రికి తేడా ఏమిటో అతను స్పష్టంగా గ్రహించగలిగాడు. తన తండ్రి మనసున్న మనిషి. తను మనసులేని మరబొమ్మ. తనకు జీవన సౌందర్యం తెలియదు. అదెలా ఉంటుందో తండ్రి తెలియబరిచాడు.

ఒక ఆదివారం అతను తన తండ్రి బ్రతికి ఉండగా యోగాసనాలు వేయడానికి తమ ఇంటికి వచ్చే ప్రతి ఒక్కరి ఇంటికి వెదుక్కుంటూ వెళ్లాడు. "మా నాన్నగారు చనిపోయారని మీరు మా ఇంటికి రావడం మానుకోకండి. నేనూ మీతో కలుస్తాను. యోగాతో నాన్నగారికి అంజలి ఘటిద్దాం" అని ఆహ్వానించాడు. అందుకు వారందరూ సంతోషంగా తమ సమ్మతి తెలిపారు.

మరునాడు తెలతెలవారుతుండగా శంకరం ఇంటి బయటి గేటు తెరిచాడు. వస్తున్నవారందరికీ హృదయపూర్వకంగా ఆహ్వానం పలికాడు. డాబా పైకి వెళ్లి వాళ్లతో పాటు ఆసనాలు వేశాడు. ఆ తరువాత ధ్యానంలో కూర్చున్నాడు.

మనసులో తండ్రి రూపం కనిపించింది. "శంకరం! మనిషి తలుపులు మూసుకుని ఒంటరిగా గదిలో ఉండిపోతున్నాడు. అది తప్పు. మన కోసం ఆకాశం బయట వేచి చూస్తున్నదని తెలుసుకోవాలి. ఇంటి తలుపులే కాదు, మనసు తలుపులు కూడా తీసుకుని బయటకు రావాలి. అప్పుడు ప్రపంచమే అతనిదవుతుంది" తండ్రి చెప్పిన మాటలు మనసులో ప్రతిధ్వనించాయి.

శంకరం కళ్లు తెరిచాడు. గదిలో ఉంటే కనిపించని ఆకాశం ఇప్పుడతనికి ఎంతో అందంగా, విశాలంగా కనిపించింది. శంకరానికి మనసు కొత్త చిగురు తొడిగినట్లు అనిపించింది. తొలిసారి అతని మనసుకు ఎంతో సంతోషం, ప్రశాంతత కలిగాయి.

☆

